అతని వయసు
ఇరవై రెండేండ్లు.
ఎథికల్ హ్యాకింగ్‌లోకి
అడుగుపెట్టి కొన్నేండ్లే అయింది.
అయితేనేం. టెక్నాలజీలో దిగ్గజ
సంస్థల లోపాలే బయటపెట్టాడు.
రివార్డులే కాదు, నాసా, ఆపిల్
సంస్థల నుంచి 'హాల్ ఆఫ్ ఫేమ్'
గౌరవాన్నీ అందుకున్న కశ్మీర్
కుర్రాడు మునీబ్
అమీన్ భట్ కథ ఇది..





# ఆపిల్ మెచ్చింది.. నాసా నచ్చింది..

ఎన్ని సెక్యూరిటీ సాఫ్ట్‌వేర్‌లు ఉపయోగించినా, సైబర్ కేటుగాళ్లు 'సిస్టమ్'లోకి చొరబడుతూనే ఉంటారు. ఏదో ఒక చిన్న లూప్ హోల్ పట్టుకుని డేటాకు కన్నం వేసేస్తారు. ఇలాంటి వాళ్లు డేటాను అమ్మకానికి పెడితేనో, బెదిరింపులతో బేరాలకు దిగుతేనో సమస్యలు బయటపడతాయి. కొంతమంది ఆ లూప్‌హోల్‌ని బయటపెట్టకుండానే ఎంచక్కా ప్రతిరోజూ సమాచారాన్ని చౌర్యం చేస్తూనే ఉంటారు. ఇలా గుట్టుగా సాగే డేటా చౌర్యాన్ని పసిగట్టడంలో మునీబ్ అమీన్ భట్ సిద్ధహస్తుడు. సోషల్ మీడియాలో చాలామంది సైబర్ సెక్యూరిటీ ఎక్స్‌పర్ట్స్‌ని చూస్తూ ఉంటాం. అలాంటి వాడే అనుకునేరు. టెక్నాలజీ రంగంలో దిగ్గజ సంస్థలైన నాసా, ఆపిల్ వంటి కంపెనీల్లోనే డేటా చౌర్యానికి పాల్పడేవారికి ఎన్ని దారులున్నాయో కనిపెట్టి చెప్పిన ఘనుడు మునీబ్.

**ఆపిల్ వినియోగదారుల డేటాను ఇతరులు పొందేందుకు 'ఐక్లౌడ్'లో కొన్ని సాంకేతిక లోపాలు ఉన్నాయని మునీబ్ గుర్తించాడు. వేలాది మంది డేటా సైంటిస్టులు, సైబర్ సెక్యూరిటీ నిపుణులు ఉన్నా, ఆ సంస్థల బలహీనతల్ని బయటపెట్టి కోట్లాదిమంది వినియోగదారులకు మేలుచేశాడు.**

**ఏక్ చోటీసీ హ్యాకింగ్ స్టోరీ!**

జంగల్‌పుర అనే చిన్న పల్లెటూరులో పుట్టి పెరిగాడు మునీబ్. ఇది దక్షిణ జమ్ము కశ్మీర్‌లోని కుల్గాం జిల్లాలో ఉంది. కశ్మీర్‌లో అప్పుడు ఇంటర్నెట్ వినియోగం అంతగా అందుబాటులో లేదు. తను (2011లో) నాలుగో తరగతి చదువుతున్నాడు. తనకు ఒక మొబైల్ ఫోన్ ఉంది. దానికి ఇంటర్నెట్ యాక్సెస్ కోసం వైఫై కనెక్షన్ పొందాలని ప్రయత్నం చేసేవాడు. అలా ఇంటర్నెట్ పొందడం కోసం హ్యాకింగ్ చేసే ప్రయత్నాల్లోకి అడుగుపెట్టాడు. పెద్దవాడవుతున్న కొద్దీ సాంకేతిక నైపుణ్యాలను మెరుగుపర్చుకుంటూ పోయాడు. ఇంటర్మీడియెట్ తర్వాత బీటెక్ కంప్యూటర్ సైన్స్‌లో చేరాడు. ఏడాది తర్వాత ఆ కోర్సుని మధ్యలోనే వదిలేశాడు. ఇప్పుడు ఇగ్నో ద్వారా బ్యాచ్‌లర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్ చదువుతున్నాడు. యూట్యూబ్‌లో పాఠాలు వింటూ ఎథికల్ హ్యాకింగ్‌లో సిద్ధహస్తుడయ్యాడు.

**గంటల్లో పని.. లక్షల్లో సంపాదన**

ఆపిల్, గూగుల్, ఫేస్‌బుక్, టెస్లా వంటి సంస్థలు తమ సేవల్లో సాంకేతిక లోపాలను, బగ్స్‌ని గుర్తించాలని నిపుణులను ఆహ్వానిస్తుంటాయి. అవగాహన ఉన్న వ్యక్తులు బగ్స్‌ని గుర్తిస్తూ కంపెనీకి తెలియజేస్తే రివార్డులతోపాట 'హాల్ ఆఫ్ ఫేమ్' గుర్తింపుతో కంపెనీ గౌరవిస్తుంది. అందిపుచ్చుకోవాలే గానీ ఎథికల్ హ్యాకర్స్‌కి ఇవే మంచి అవకాశాలు అనుకున్నాడు మునీబ్. రోజులో 3 నుంచి 4 గంటల సమయం ఎథికల్ హ్యాకింగ్ కోసం కేటాయిస్తాడు. టెక్నాలజీ రంగంలో దిగ్గజ కంపెనీలకు సవాళ్లుగా మారిన సమస్యలను గుర్తించడాన్నే ఉపాధిగా మలచుకున్నాడు. ఇంటిపట్టునే ఉంటూ ఎథికల్ హ్యాకింగ్ ద్వారా నెలకు లక్షల్లో సంపాదిస్తున్నాడు.

సాంకేతిక రంగంలో ఆపిల్ అనేక కొత్త ఒరవడులు సృష్టించింది. నూతన సాంకేతికతను ఆవిష్కరించడంలో ఆ సంస్థకు అదే సాటి. అంత పెద్ద సంస్థ చిన్న చిన్న లోపాల్ని పసిగట్టలేకపోయింది. ఆపిల్ వినియోగదారుల డేటాను ఇతరులు పొందేందుకు 'ఐక్లౌడ్'లో కొన్ని సాంకేతిక లోపాలు ఉన్నాయని మునీబ్ గుర్తించాడు. వేలాది మంది డేటా సైంటిస్టులు, సైబర్ సెక్యూరిటీ నిపుణులు ఉన్నా, ఆ సంస్థల బలహీనతల్ని బయటపెట్టి కోట్లాదిమంది వినియోగదారులకు మేలుచేశాడు. కొన్ని దేశాల జీడీపీ కంటే ఎక్కువ ఆదాయం ఉన్న ఆపిల్ కంపెనీ బాస్‌లకు తలభారం తగ్గించాడు. అంతమేలు చేసినవాడిని ఊరికే మర్చిపోతారా? కంపెనీకి తగ్గ బహుమతి ఇస్తారు. కదా, కానీ, అంతకంటే ఎక్కువే చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఎథికల్ హ్యాకర్స్ పసిగట్టని సమస్యలెన్నో మునీబ్ గుర్తించాడు. నాసాకూ నాణ్యమైన సేవలు అందించాడు. మునీబ్ సేవలు మరచిపోకుండా ఆ సంస్థలు ఈ కశ్మీరీ యువకుడిని 'హాల్ ఆఫ్ ఫేమ్'గా ప్రకటించాయి. ■